

గాలేరు-నగరి కాలువ లైనింగ్, నిర్మాణ పనులు

గాలేరు-నగరిలో అవినీతి ప్రవాహం

నంద్యాల, జూన్ 24 (ఆంధ్రజ్యోతి)

ఆయకట్టు రైతులకు సాగునీరు అందించడం ప్రభుత్వాల బాధ్యత. దీని కోసం కాలువలు మరమ్మతు చేయించాలి. కానీ గత వైసీపీ ప్రభుత్వం మాత్రం మరమ్మతు పనులను రైతుల కోసం చేయలేదు. పూర్తిగా కాంట్రాక్టర్లకు మేలు కలిగేలా చేపట్టింది. గాలేరు - నగరి కాలువ లైనింగ్ పనుల్లో నాసిరకం రాజ్యమేలింది. పనులు మొదలైన కొద్ది రోజులకే చాలా చోట్ల లైనింగ్ పెచ్చులూడిపోయింది. కాంట్రాక్టర్లకు వైసీపీ ప్రభుత్వం వంతపాడి కోట్ల రూపాయల ప్రజాధనం వృథా చేసింది. ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడంతో కాలువ వెంట భూగర్భ జలాలు పడిపోయాయి. దీంతో రైతులు ఇబ్బందిపడుతున్నారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి స్పందించి గాలేరు - నగరి పనుల్లో అవినీతిని బయటికి తేవాలని పలువురు కోరుతున్నారు.

- వైసీపీ ప్రభుత్వంలో నాసిరకం పనులు
- డబ్బులు దండుకునేందుకే కాలువకు సీసీ లైనింగ్
- నాణ్యత పాటించని కాంట్రాక్టర్లు
- సిమెంట్‌తో లైనింగ్‌తో పడిపోయిన భూగర్భ జలాలు
- విలవిలలాడుతున్న రైతులు

కృష్ణా నది వరద నీటిని రాయలసీమ జిల్లాలకు గాలేరు - నగరి ద్వారా తరలించాలి. కర్నూలు, కడప, చిత్తూరు, అనంతపురం 2.65 లక్షల ఎకరాలకు నీరందించేలా ఈ ప్రాజెక్టును రూపొందించారు. ఆ తర్వాత నెల్లూరు జిల్లాలోని మరో 2.14 వెరసి 4.79 లక్షల ఎకరాలకు సాగు నీరందించేలా చేపట్టారు. వరద ఎక్కువగా ఉన్న సమయాల్లో శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 38 టీఎంసీల మిగులు జలాలు పోతిరెడ్డిపాడు ద్వారా గోరకల్లు రిజర్వాయర్‌కు అక్కడి నుంచి అవుకు రిజర్వాయర్ ద్వారా రాయలసీమ, నెల్లూరు జిల్లాకు తరలించాలి. దీని ద్వారా సాగు నీరే కాకుండా పది లక్షల జనాభాకు తాగునీరు కూడా అందుతుంది.

● లైనింగ్ పనులంటూ..



దెబ్బతిన్న కాలువ లైనింగ్

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నీటి తరలింపు సామర్థ్యం 20 వేల క్యూసెక్కుల నుంచి 30 వేల క్యూసెక్కులకు పెరిగేలా గాలేరు - నగరి కాల్వకు లైనింగ్ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా గోరుకల్లు రిజర్వాయర్ నుంచి అవుకు రిజర్వాయర్ సమీపంలోని గాలేరు హెడ్ రెగ్యులేటర్ వరకు 57.7 కిలోమీటర్ల వరకు మట్టికట్టతో కాల్వకు సిమెంట్ లైనింగ్ పనులకు టెండర్లు పిలిచారు. అలాగే అవుకు టన్నెల్ పనులను కూడా చేర్చి మొత్తం రూ.1297 కోట్లకు టెండర్లు ఖరారు చేశారు. ఈ టెండర్లను డీఎస్ఆర్, వీఏఆర్‌కెఎస్ కంపెనీలు జాయింట్ వెంచర్‌తో 57.7 కిలోమీటర్లకు 2021 ఫిబ్రవరి నెలలో టెండర్లను దక్కించుకొని సిమెంట్ లైనింగ్ పనులు ప్రారంభించింది. ఇప్పటి వరకు 50 కిలోమీటర్ల మేర సిమెంట్ లైనింగ్ పనులు పూర్తి అయ్యాయి. ఇంకా 7.7 కిలోమీటర్ల మేర పనులు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే పనుల్లో గుత్తేదారులు ఏ మాత్రం నాణ్యత ప్రమాణాలను పాటించలేదన్న విమర్శలు గతంలో వచ్చాయి. కాల్వకట్ట రాతిపొర వచ్చిన చోట షార్ట్ క్రిట్ పద్ధతిలో లైనింగ్ పనులు చేపట్టారు. ఈ పద్ధతిలో 78 ఎంఎం మందంతో లైనింగ్ పనులు చేయాల్సి ఉండగా, తొలుత 39 ఎంఎం మందంతో సిమెంట్ వేయాలి. రెండు, మూడు రోజులు క్యూరింగ్ చేసిన తర్వాత చివరి పొర వేయాలి. అయితే కాంట్రాక్టర్లు ఈ నిబంధనలను పట్టించుకోకుండా ఒకేసారి సిమెంటు పనులు చేసి మమ అనిపించారు. ఇక రాతి పొరలు లేనిచోట ఇదే విధంగా లైనింగ్ చేయటం గమనార్హం. దీంతో లైనింగ్ ఎక్కడికక్కడ ఊడి వచ్చింది. నీటి సామర్థ్యం తరలింపునకు సామర్థ్యం పెరగడం దేవుడెరుగు, అసలు నీరు పారక ముందే ఎక్కడికక్కడ లైనింగ్ దెబ్బతినిపోయింది. ఇది పనుల్లో నాణ్యతకు, అప్పటి అధికారులు పర్యవేక్షణకు నిదర్శనం. ఈ విషయంపై ప్రస్తుత మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అప్పట్లో పరిశీలించి వైసీపీ ప్రభుత్వం, గుత్తేదారుల పనితీరును ఎండగట్టారు. దీంతో అధికారులు లైనింగ్ దెబ్బతిన్నచోట ప్యాచ్ వర్కులు చేసి అంతా సక్రమంగా జరుగుతోందని చెప్పుకొచ్చారు. మొత్తమ్మీద వైసీపీ ప్రభుత్వంలో గాలేరు - నగరి కాలువ లైనింగ్ పనులకు కేటాయించిన రూ.1297 కోట్లలో భారీగా అవినీతి జరిగిందని, నాసిరకం పనులతో ప్రభుత్వ ఖజానాకు గండికొట్టారని, ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం దీనిపై విచారణ చేసి గుత్తేదారులు జేబుల్లోనికి వెళ్లిన డబ్బులను కక్కించాలన్న డిమాండ్ వినిపిస్తోంది.



గాలేరు-నగరి కాలువకు సీసీ లైనింగ్

● తగ్గిన భూగర్భ జలాలు

గతంలో గాలేరు - నగరి కాలువ పూర్తిగా మట్టి కాలువ. వరద నీటిని ఈ కాలువ ద్వారా తరలించడం వల్ల కాలువ ఉన్నంత మేర భూగర్భ జలాలు పుష్కలంగా ఉండేవి. వల్ల పాణ్యం, బనగానపల్లె, అవుకు, సంజామలతో పాటు ఆయా మండలాల్లోని గాలేరు నగరి కాల్వ పరివాహక పరిసర ప్రాంతాల్లోని గ్రామాల పరిధిలోని బావులు, బోర్లు ఉన్న రైతులు రెండుసార్లు పంటలు సాగు చేసుకునేవారు. అయితే కాలువలో నీటిని సాధ్యమైనంత మేర వేగంగా కిందికి తరలించాలన్న ఉద్దేశంతో వైసీపీ ప్రభుత్వం లైనింగ్ పనులు చేపట్టారు. దీని వల్ల కాలువ ఉన్నంత మేర భూగర్భ జలాలు పడిపోయాయి. కాలువ వెంట ఉన్న బావులు, బోర్లు ఎండి ఎ... యాయి. కాలువ కు సిమెంటు లైనింగ్ పనులు చేస్తే భూగర్భ జలాలు పడిపోతాయని రైతులు అప్పట్లో ఆందోళన చెందారు. ఇలా జరగకుండా కాలువ మధ్యలో అక్కడక్కడా బోర్లు వేయిస్తామని అధికారులు చెప్పారు. ఆ తర్వాత ఆ విషయాన్ని పూర్తిగా విస్మరించారు.

● అవినీతిని వెలికితీయాలి

గాలేరు - నగరి లైనింగ్ పనుల్లో పూర్తిగా నాణ్యత లోపించింది. పనులు చేసిన కొద్ది రోజులకే కాలువ వెంట లైనింగ్ దెబ్బతినింది. గత వైసీపీ ప్రభుత్వం కనీసంగా శ్రద్ధ కనబరచలేదు. ఈ లైనింగ్ పనులను కేవలం కమీషన్ల కోసం, గుత్తేదారులు జేబులు నింపటం కోసం చేపట్టినట్లు అనిపిస్తోంది. లైనింగ్ పనుల్లో జరిగిన అవినీతిని వెలికి తీయాలి.

\- బెడదల మహేశ్వరరెడ్డి, టీడీపీ నాయకుడు, పాతపాడు గ్రామ సర్పంచ్, బనగానపల్లె మండలం

లైనింగ్ పనులు అన్యాయం

గాలేరు నగరి కాల్వలకు సిమెంట్ లైనింగ్ పనులు చేపట్టడం దారుణం. కేవలం కడప జిల్లాకు వరదనీటిని త్వరగా తరలించాలన్న ఉద్దేశంతో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాంత రైతులు, ప్రజలకు అన్యాయం చేశారు. లైనింగ్ పనుల వల్ల భూగర్భ జలాలు పడిపోయాయి. ఇది చాలా అన్యాయం.

\- బి.గోపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్, టీడీపీ నాయకుడు, యనకండ్ల, బనగానపల్లె



నాణ్యత లోపించిన కాలువ నిర్మాణ పనులు



సమీక్షా సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు, జేసీ, జిల్లా అధికారులు

నాణ్యమైన విద్య అందించండి

కలెక్టర్ కె.శ్రీనివాసులు

నంద్యాల (కల్చరల్), జూన్ 25: జిల్లాలోని అన్ని సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, ఎలాంటి లోపం లేకుండా అత్యవసర మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు సంక్షేమ హాస్టళ్ల వెల్ఫేర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్లో సంక్షేమ హాస్టళ్ల పనితీరు, విద్యార్థుల అడ్మిషన్, మౌలిక వసతులపై జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. డీఆర్వో పద్మజ, అన్ని సంక్షేమ హాస్టళ్ల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు మాట్లాడుతూ సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్లన్నీ భర్తీ చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూలో, ఆహారం కలుషితమైన సంబంధిత వార్డెన్లను నేరుగా విధుల నుంచి తొలగించడానికి తక్షణ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. దాతల సహకారంతో లేదా అందుబాటులో ఉన్న నిధులతో విద్యార్థులకు మస్కిటో నెట్లను ఏర్పాటు చేసుకోవాలని, సురక్షిత మంచినీరు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వసతి గృహాల నిర్వహణపై తహసీల్దార్లతో తనిఖీలు నిర్వహించి నివేదికలు సేకరించామన్నారు. జిల్లాలో 38 సాంఘిక సంక్షేమ, 34 బీసీ వెల్ఫేర్, 13ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళ్లు, 46 కేజీబీవీ రెసిడెన్షియల్ పాఠశాలలు, 7 అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, 6 జ్యోతిరావుపూలే పాఠశాలలు ఉన్నాయని వీటి పనితీరుపై ఇటీవల తహసీల్దార్‌లు తనిఖీలు నిర్వహించి సమస్యలు గుర్తించామన్నారు. జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ హాస్టళ్లకు ఆహార పదార్థాల సరఫరాలోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హాస్టళ్లను పరిశుభ్రంగా ఉంచాలని, క్లోరినేషన్ చేసిన సురక్షిత మంచినీటిని సరఫరా చేయాలని అన్నారు. కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, అన్ని సంక్షేమ హాస్టళ్ల వార్డెన్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైల క్షేత్ర అభివృద్ధికి కృషి

- ఆలయ పవిత్రతను కాపాడుతాం
- ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

శ్రీశైలం, జూన్ 25: రాబోయే ఐదు దశాబ్దాలను దృష్టిలో ఉంచుకుని శ్రీశైలం క్షేత్రాన్ని బృహత్తర ప్రణాళికతో అభివృద్ధి చేస్తామని శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం దేవస్థానం కార్యాలయ భవనంలోని సమావేశమందిరంలో క్షేత్రాభివృద్ధిపై బుడ్డా రాజశేఖరరెడ్డి సమీక్షాసమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీశైలం క్షేత్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ఆలయ పవిత్రను కాపాడుతామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి శ్రీశైల క్షేత్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి ఉందని తదనుగుణంగా క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలు, దేశం నలుమూలల నుంచి భక్తులు శ్రీశైల క్షేత్రాన్ని సందర్శించి స్వామి, అమ్మవార్లను దర్శించుకునాంటున్నారని, భక్తులకు కల్పించే మౌలికసదుపాయాల కల్పనపై ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనానికి క్యూలైన్లలో భక్తులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా దేవస్థానం అతిథి గృహాలు, వసతి గదులలోని సదుపాయాలను మరింతగా మెరుగుపరచాలన్నారు. పర్వదినాలు, వారాంతరాలు, సెలవు రోజులలో క్షేత్రానికి భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్, వసతి తదితర ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అలాగే సిబ్బంది అంతా అంకితభావంతో విధులు నిర్వహిస్తూ భక్తులకు సేవలందించాలన్నారు. పరస్పర సమన్వయంతో క్షేత్రాభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. క్షేత్రాన్ని సుందరీకరంగా, ఆహ్లాదకరంగా మార్చేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అన్ని విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాగిలం టీనా పదవీ విరమణ

నంద్యాల క్రైం, జూన్ 25 : నేరం జరిగిన ప్రదేశంలో ఆధారాలు వెతకడం, పోలీసులకు క్లూస్ అందించడం... ఇదీ జాగిలం టీనా పని. కానీ ఈ పనులు చేయడానికి వాటికి చాలా శిక్షణ ఇవ్వాలి. హత్య, దొంగతనం, పేలుడు పదార్థాలు, డ్రగ్స్‌ను గుర్తించడం వంటి నేరాలను ఛేదించేందుకు పోలీసులకు ఉన్న ఆయుధం ఈ జాగిలాలే. అయితే పోలీసు జాగిలం టీనా పదవీవిరమణ సందర్భంగా పోలీసు అధికారులు ఎమోషనల్ అయ్యారు. నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో ల్యాబ్రెడార్ రెట్రివర్ జాతికి చెందిన పోలీసు జాగిలం టీనా మంగళవారం పదవీ విరమణ పొందింది. నంద్యాల జిల్లా సాయుధ రిజర్వు పోలీసులు పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వీఐపీ, వీవీఐపీల బందోబస్తు విధుల్లో పేలుడు పదార్థాలను కనుక్కోవడం టీనా ప్రత్యేకత. ఈ జాగిలం సుమారు 9 సంవత్సరాల 7 నెలలు ఉమ్మడి జిల్లాలో పోలీసు శాఖలో సేవలందించింది. ఈ సందర్భంగా ఎస్పీ రఘువీర్‌రెడ్డి పోలీసు జాగిలం టీనాకు శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ నంద్యాల జిల్లా ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు టీనా సేవలు అందించిందని అన్నారు. అనంతరం టీనా హ్యాండ్లర్ ఏఆర్ పోలీస్ కానిస్టేబుల్ వై.సుంకిరెడ్డిని కూడా సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.ప్రవీణ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఇకపై జాగిలం టీనా జిల్లా కేంద్రంలోని డాగ్‌హోంలో ఉంటుందని అధికారులు తెలిపారు.



టీనాను సత్కరిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి



కుక్కను హింసిస్తున్న యువకుడు (ఫైల్)

కుక్కపై దాష్టీకం

- శునకాన్ని గిరగిరా తిప్పి హింసించిన యువకుడు
- ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టింగ్
- కేసు నమోదు, అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఆలూరు, జూన్ 25: సోషల్‌మీడియా ద్వారా ఫేమస్ కావాలన్న ఆలోచనతో వికృత వీడియోలు తీస్తున్నారు కొందరు యువకులు. చెత్త వీడియోలు తీస్తూ అందరూ అసహ్యించుకునేలా తయారయ్యారు. తాజాగా ఆలూరుకు చెందిన ఓ యువకుడు కుక్క కాళ్లు పట్టుకుని గిరాగిరా తిప్పి విసిరి పడేసిన అమానవీయ ఘటన నెట్టింట వైరల్‌గా మారింది. ఆలూరు పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన వినోద్ అనే యువకుడు ఓ వీధి కుక్కను హింసిస్తూ తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ద్వారా నాలుగు రోజుల క్రితం వీడియో పోస్ట్ చేశాడు. దీన్ని చూసి ఆగ్రహించిన కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం మార్కాపురానికి చెందిన స్టే ఎనిమల్ ఫౌండేషన్ మేనేజర్ అదిలాపురం గౌతం ప్రివెంట్స్ ఆఫ్ ఎనిమల్స్ క్రుయాలిటీ చట్టం ద్వారా కేసు నమోదు చేయాలని ఆలూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారించి ఆ యువకుడిని మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఓబులేసు తెలిపారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో జేసీ పర్యటన

పరిహారం అందలేదని ఫిర్యాదులు

మరోసారి కొలతలు వేయమని అధికారులను ఆదేశించిన రాహుల్‌కుమార్‌రెడ్డి



రుద్రవరం గ్రామంలో హైవేలో స్థలాలు కోల్పోతున్న బాధితులతో మాట్లాడుతున్న జేసీ

పాములపాడు, జూన్ 25 : మండలంలో జరుగుతున్న నేషనల్ హైవే పనుల్లో భూములు, స్థలాలు కోల్పోయినవారిని కలుసుకొని సమస్యలు తెలుసుకొనేందుకు నంద్యాల జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి మంగళవారం సుడిగాలి పర్యటన నిర్వహించారు. నేషనల్ హైవే పనుల్లో క్రిష్ణరావుపేట గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయం, సంతమార్కెట్‌ను తొలగిస్తున్నారని వాటికి పరిహారం అందలేదని గ్రామస్థులు రామక్రిష్ణ, జనార్దన్ ఫిర్యాదు చేశారు అలాగే పాములపాడు గ్రామ శివార్లలోని జెరుషలేంషాలను కూల్చవద్దు అంటూ భక్తులు పెద్ద ఎత్తున చేరుకొని జేసీని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం రూపొందించిన మ్యాపు మేరకు తొలగించారని, తాను డిజైన్లను మార్చడానికి లేదని వారికి నచ్చచెప్పారు. అలాగే శ్రీ శారద విద్యానికేతన్ పాఠశాల క్రీడా ప్రాంగణం మొదట 33 సెంట్లు పోతుందని నోటీసులు ఇచ్చి ఇప్పుడు 66 సెంట్లు తొలగిస్తున్నారని బాధితులు వాపోయారు. దీంతో మళ్లీ ఒకసారి కొలతలు వేసి బాధితులకు సరైన సమాచారం ఇవ్వాలని తహసీల్దార్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే పిడి గోవర్ధన్ గనిన్నా, ఆర్డీఓ దాస్, తహసీల్దార్ వెంకటరమణ, ఎస్ఐ అశోక్, లక్ష్మీనారాయణ, వీఆర్ఓలు హైవే సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్


సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

సి. బెళగల్, జూన్ 25: మండలంలోని తిమ్మనదొడ్డి వద్ద తుంగభద్ర నదితీరం నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న తెలంగాణకు చెందిన 5 ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడుతూ తుంగభద్ర నదితీర గ్రామాలలో నుండి అక్రమంగా ఇసుక తరలిస్తే జరిమానా రూ 50 వేలు విధిస్తామని, ట్రాక్టర్లు సీజ్ చేస్తానని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన 4 ట్రాక్టర్లతో సోమాపురం గ్రామానికి చెందినవారు తెలంగాణ హద్దులను దాటి ఆంధ్ర హద్దులల్లోకి వచ్చి ఇసుక తరలించుకపోవడానికి ప్రయత్నిస్తున్నారని, ఈ విషయంలో పలుమార్లు హెచ్చరించామని అన్నారు. తెలంగాన నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను స్టేషన్ తరలించి కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు.

రోగులకు మెరుగైన సేవలు


మాట్లాడుతున్న సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), జూన్ 25: ఆసుపత్రిలో పది ఓపీ కౌంటర్ల ద్వారా సాధారణ రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని, ఓపీ కౌంటర్లను పెంచడం ద్వారా దూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు త్వరగా చికిత్స పొందుతున్నారని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం ధన్వంతరి హాలులో ఆసుపత్రిలోని వివిధ విభాగాల అధిపతులతో సూపరింటెండెంట్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలోని ఆరోగ్యశ్రీ టార్గెట్‌ను విజయవంతంగా పూర్తి చేసిన జనరల్ సర్జరీ, సైక్రియాట్రిక్ హెచ్‌వోడీలను సూపరింటెండెంట్ అభినందించారు. ఆసుపత్రిలోని ఈ-హాస్పిటల్‌లో ఫార్మసీ ల్యాబ్ మాడ్యూల్ ఇంకా మెరుగుపడాలన్నారు. ఆక్యూట్ మెడికల్ కేర్ యూనిట్‌లో పడకల కొరత కారణంగా ఓల్డ్ బ్లడ్ బ్యాంకులో మరో 12 పడకలతో ఏంఏసీ పొడిగింపు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మందుల డిస్పెన్సరీతో కనెక్ట్ చేయని గదుల ద్వారా న్యూ క్యాజువాలిటీ, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగానికి రెండు గదులు కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో హేమనళిని, ఏఆర్ఎంవో వెంకటరమణ, న్యూరాలజీ, రేడియాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, పీడియాట్రిక్, మెడిసిన్, నెఫ్రాలజీ హెచ్‌వోడీలు సి. శ్రీనివాసులు, రాధారాణి, మంజులబాయి, విజయానందబాబు, ఇక్బాల్ హుశేన్, అనంత్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ శివబాల పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు

● రాయలసీమ వర్సిటీ వీసీ సుధీర్ ప్రేమ్ కుమార్



సదస్సులో పాల్గొన్న అధికారులు

కర్నూలు(అర్బన్), జూన్ 25: మత్తు పదార్థాలకు బానిసలు కాకూడదని రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ బి.సుధీర్ ప్రేమ్ కుమార్ యువతకు పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల నివారణ, నిషేధంపై మంగళవారం రాయలసీమ యూనివర్సిటీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీసీతో పాటు స్పెషల్ ఎన్‌ఫోర్స్ బ్యూరో ఏఎస్పీ ఎం.నాగరాజు, సూపరింటెండెంట్ ఎస్.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. ప్రస్తుతం యువత మాదక ద్రవ్యాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. వాటిని తీసుకోవడం వల్ల వచ్చే దుష్ప్రభావాలు, వాటిని తీసుకుంటే చట్టపరమైన శిక్షల గురించి వివరించారు. ఈ సదస్సులో ప్రిన్సిపాళ్లు ప్రసాదరెడ్డి, సీవీ కృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎస్.నాగరాజు, కేవీ రత్నం, నాగచంద్రుడు, విజయుడు, శివప్రసాదరెడ్డి తదితరులు అధ్యాపకులు పాల్గొన్నారు.

పీరుసాహెబ్ పేటలో ఉద్రిక్తత


పీరుసాహెబ్ పేట గ్రామంలో ఇరువర్గాలను చెదరగొడుతున్న పోలీసులు

మిడుతూరు, జూన్ 25: మండల పరిధిలోని పీరుసాహెబ్ పేట గ్రామంలో మంగళవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పాత కక్షలు మనసులో పెట్టుకుని రెండు వర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నాయి. గ్రామస్థుల మేరకు.. పీరుసాహెబ్ పేట గ్రామంలో వడ్డె సామాజిక వర్గానికి చెందిన కొందరు యువకులు గత ఏడాది వినాయక చవితి సందర్భంగా ఘర్షణ పడ్డారు. ఆ సమయంలో పరస్పరం దాడులు చేసుకోవడంతో కేసులు నమోదయ్యాయి. ఈ పాత కక్షలు మనసులో పెట్టుకుని మంగళవారం సాయంకాలం పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా ప్రత్యర్థి వర్గానికి చెందిన వారు దాడులకు పాల్పడ్డారు. ఈ ఘర్షణలో లక్ష్మీనరసమ్మ, రమణమ్మ, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ జగన్ మోహన్ అప్రమత్తమై పోలీసు సిబ్బందితో గ్రామానికి చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

డీఈవో వర్సెస్ సమగ్ర శిక్ష ఏపీసీ

● అయోమయంలో ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది



కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 25: జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు అధికారి మధ్య కోల్డ్ వార్ జరుగుతోంది. జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలోని ఉద్యోగులు ఎవరి మాట వినాలో తెలియని అయోమయంలో పడ్డారు. జిల్లా సమగ్ర శిక్ష కన్వీనర్‌గా జిల్లా విద్యాశాఖ అధికారి ఉంటారు. చైర్మన్‌గా కలెక్టర్ కొనసాగుతారు. పాఠశాల విద్యాశాఖకు సంబంధించిన వివిధ అంశాలను జిల్లా విద్యాశాఖ అధికారి, ఎస్ఎస్ ఏపీసీ ఇద్దరు సమన్వయం చేసుకుని పని చేయాలి. అయితే ఈ అధికారులు ఎవరంతకు వారు తన కనుసన్నల్లోనే అడ్మిషన్లు నడవాలని అనుకున్నట్లు ఉంది. జిల్లా విద్యాశాఖ అధికారి ఒక అడుగు ముందుకు వేసి ఈ నెల 24వ తేదీన ఎస్ఎస్ ఏపీసీ విజయజ్యోతి కుమారిని రిలీవ్ చేసి అదే రోజు జిల్లా విద్యాశాఖ అధికారి శామూయేల్ తన కార్యాలయ ఉద్యోగులతో ఎస్ఎస్ ఏపీసీ చాంబర్‌కు వెళ్లి చార్జ్ తీసుకున్నారు. సమగ్ర శిక్ష కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం ద్వారా చేపట్టిన పథకాలు సక్రమంగా అమలు చేయాలని డీఈవో సూచించారు. కార్యాలయానికి వచ్చిన ఫైల్స్‌ను గ్రీవెన్స్‌ను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని విధి నిర్వహణలో ఎటువంటి జాప్యం జరిగినా ఉపేక్షించేది లేదని హెచ్చరిస్తూ డీఈవో పలు సూచనలు ఇచ్చారు. ఇదిలా ఉండగా.. ఎప్పుడో ఫిబ్రవరిలో కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్స్‌తో ఇప్పుడు రిలీవ్ చేయడం ఏమిటనే ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఎస్ఎస్ ఏపీసీ చార్జ్ తీసుకున్న వెంటనే జీసీడీవో, అలెస్కో సెక్టోరల్ అధికారులను డీఈవో శామూయేల్ రిలీవ్ ఆర్డర్స్ కూడా ఇచ్చారు. కార్యాలయంలో ఏం జరుగుతుందో ఉద్యోగులకు తెలియడం లేదు. అసలు ఎస్ఎస్ ఏపీసీ ఎవరనే ప్రశ్న ఇటు ఉద్యోగుల్లోనూ, అటు కార్యాలయానికి వచ్చిన ప్రజల్లో మిగిలింది. ఇద్దరు అధికారుల మధ్య మనస్పర్థలు తారా స్థాయికి చేరాయి. కలెక్టర్ జోక్యం చేసుకోకపోతే ఈ వ్యవహారం ముదిరి పాకాన పడే అవకాశం ఉంది.

● నన్ను రిలీవ్ చేసే అధికారం డీఈవోకు లేదు

డిప్యూటీ కలెక్టర్ క్యాడర్ స్థాయిలో ఉన్న నన్ను రిలీవ్ చేసే అధికారం జిల్లా విద్యాశాఖ అధికారులకు లేదు. గత ఫిబ్రవరిలో వచ్చిన ఆర్డర్‌తో ఇప్పుడు ఎలా రిలీవ్ చేస్తారు? కలెక్టర్ నోటిఫైల్ అప్రూవల్ లెటరు కూడా లేకుండా డీఈవో రిలీవ్ ఆర్డర్‌ను కార్యాలయ సూపరింటెండెంట్‌కు ఇచ్చి సీటులో కూర్చోవాల్సిన అవసరం ఏమిటో తెలియడం లేదు. కలెక్టర్‌ను బైపాస్ చేసి ఫైల్‌ను ఫార్వర్డ్ చేశారు. రిలీవ్ ఆర్డర్‌ను సూపరింటెండెంట్‌కు ఇస్తే.. అది నాకు ఇచ్చినట్లేనా? ఈ విషయాన్ని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావుకు మంగళవారం వివరించాను.

- సమగ్ర శిక్ష ఏపీసీ విజయ జ్యోతి కుమారి

● కలెక్టర్ ఆదేశాల మేరకే రిలీవ్ చేశాం

కలెక్టర్ నోటిఫైల్ ఆర్డర్స్ ఆదేశాల మేరకు ఎస్ఎస్ ఏపీసీకి నిబంధనలకు లోబడే రిలీవ్ ఆర్డర్ ఇచ్చాను. కలెక్టర్ రిలీవ్ చేయమంటేనే చేశాను. ఇందులో నా ప్రమేయం ఏమీ లేదు. ఫిబ్రవరి 16వ తేదీనే ఎస్ఎస్ఏ ఏపీవోకు రిలీవ్ ఆర్డర్స్ వచ్చాయి. అప్పుడు ఎన్నికల నోటిఫికేషన్ రావడం, సంబంధిత అధికారి అవసరాల మేరకు రిలీవ్ చేయలేదు. ఎన్నికల కోడ్ ముగియడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు రిలీవ్ చేశాను.

- జిల్లా విద్యాశాఖ అధికారి శామూయేల్

అనుమతి లేకుండా రోడ్డు వేస్తున్నందుకే కేసులు

అల్ట్రాటెక్ సిమెంట్ యాజమాన్యం నిబంధనలు అతిక్రమించింది ● ఆర్అండ్‌బీ ఈఈ


విలేఖర్లతో మాట్లాడుతున్న ఆర్అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి

బనగానపల్లె, జూన్ 25: రోడ్లు, భవనాల శాఖ అనుమతులు లేకుండా రోడ్డు నిర్మిస్తుండడం వల్లనే అల్ట్రాటెక్ సిమెంట్ యాజమాన్యంపై, తుమ్మలపెంటకు చెందిన కాంట్రాక్టరు నాగమల్లేశ్వరరెడ్డిపై కేసులు నమోదు చేసినట్లు నంద్యాల జిల్లా ఆర్అండ్‌బీ ఈఈ ఏవీ. శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం బనగానపల్లె పట్టణంలోని ఆర్అండ్‌బీ కార్యాలయంలో విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్లు, భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఒత్తిడి వల్లనే తాము అల్ట్రాటెక్ సిమెంట్ యాజమాన్యం, నాగమల్లేశ్వరరెడ్డిపై కేసులు పెట్టామనడం అవాస్తవమన్నారు. ఈ కేసుతో రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదన్నారు. మంత్రిపై ఆరోపణలు చేయడం తగదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు నిర్మిస్తుండడం వల్లనే కేసు నమోదు చేశామన్నారు. తాను అంకిరెడ్డిపల్లె నుంచి తుమ్మలపెంటకు వెళ్తుండగా ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన తమ శాఖ అనుమతులు లేకుండా అల్ట్రాటెక్ సిమెంట్ యాజమాన్యం తరపున తుమ్మలపెంటకు చెందిన నాగమల్లేశ్వరరెడ్డి 150 మీటర్ల పొడవున సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరు రోడ్డు వేసినా కేసులు పెడతామన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ డీఈ సునీల్ రెడ్డి, ఏఈ హుసేన్ పాల్గొన్నారు.

ఆళ్లగడ్డలో హత్య

● టీడీపీకి చెందిన దంపతులపై దాడి
● ఘటనలో భాస్కర్ రెడ్డి భార్య మృతి
● ఆస్తి గొడవలే కారణమంటున్న పోలీసులు



మృతురాలు శ్రీదేవి (ఫైల్)

నంద్యాల, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన టీడీపీ వర్గీయుల మీద మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటనలో టీడీపీ నాయకుడు అట్ల భాస్కరరెడ్డి గాయపడగా, ఆయన భార్య శ్రీదేవి (55) మృతి చెందింది. ఆళ్లగడ్డ పట్టణం పాత బస్టాండ్ ప్రాంతంలోని పాతూరు వీధిలో నివాసం ఉండే భాస్కర్‌రెడ్డి, ఆయన భార్య శ్రీదేవి మంగళవారం సాయంత్రం 6:30 గంటల సమయంలో బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చారు. వాహనం దిగి ఇంట్లోకి వెళ్తుండగా ముసుగులు వేసుకున్న ఓ మహిళ ముగ్గురు పురుషులు ఒక్కసారి దాడికి దిగారు. వచ్చీ రావడంతోనే భాస్కరరెడ్డి దంపతుల కళ్లలో కారంకొట్టి ఇనుప రాడ్లతో దాడి చేశారు. ఈ దాడిలో శ్రీదేవి అక్కడికక్కడే మృతి చెందింది. భాస్కరరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి, తర్వాత మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అసలే ఫ్యాక్షన్ గడ్డ, పైగా కొద్ది రోజులుగా ఆళ్లగడ్డలో పరిస్థితులు ఉద్రిక్తంగా ఉన్నాయి. దీనికి తోడు హత్య జరిగింది ఓ టీడీపీ ముఖ్య నాయకుడి ఇంటి వెనుకే కావటంతో, ఇది కచ్చితంగా ఫ్యాక్షన్ హత్యే అని భావించిన పట్టణ ప్రజలు, పోలీసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. బాధితుడిని పరామర్శించడానికి వచ్చిన ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ హత్య విషయంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులు ఎవరో వెంటనే తేల్చాలంటూ పోలీసులను ఆదేశించారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి అనుమానితులు ఎవరన్న దానిపైన క్షుణ్ణంగా ఆరా తీశారు. దాడి కేవలం ఆస్తి గొడవల వల్లే జరిగిందని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. భాస్కర్‌రెడ్డికి ఆయన తమ్ముడు అట్ల గోపాల్‌రెడ్డి మధ్య కొన్నేళ్లుగా ఆస్తి గొడవలు నడుస్తున్నాయని, దీనిని మనసులో పెట్టుకుని గోపాల్‌రెడ్డి, ఆయన భార్య శిరీష కొద్ది మరికొంతమందితో కలిసి భాస్కర్‌రెడ్డి దంపతుల మీద దాడికి పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. ఇది పూర్తిగా ఆస్తి గొడవే కానీ, ఇందులో ఎలాంటి రాజకీయ కోణం లేదన్నారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భాస్కర్ రెడ్డి

నిరర్థక పీఎం కిసాన్ పథకం

ఏటా తగ్గిపోతున్న రైతుల సంఖ్య
కొత్త వారికి నో చాన్స్.. ఐదేళ్లుగా పని చేయని వెబ్‌సైట్
పట్టించుకోని నాటి వైసీపీ సర్కార్



కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 25 : ఈ రైతు పేరు రాము.. కోడుమూరు మండలం క్రిష్ణాపురం గ్రామంలో రెండు ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నాడు. కొన్నేళ్లుగా వ్యవసాయంలో కలిసి రాక కుటుంబ జీవనం కోసం కర్నూలు వచ్చి రాజ్‌విహార్ ప్రాంతంలో టీ కొట్టు నిర్వహిస్తున్నాడు. గత ఐదు సంవత్సరాలుగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద ఇప్పటి దాకా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 17 విడతల డబ్బులు బ్యాంకు ఖాతాకు విడుదల కాలేదు. ఎందుకిలా జరుగుతుందో అర్థం గాక వ్యవసాయాధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో వెబ్‌ల్యాండ్ యాప్‌లో రైతు పేరు నమోదైతేనే ఈ పథకం డబ్బులు బ్యాంకు ఖాతాకు విడుదలవుతాయని వ్యవసాయాధికారి చెప్పడంతో అతను మీసేవా కేంద్రం చుట్టూ తిరుగుతున్నాడు. ఆ వెబ్‌ల్యాండ్ సైట్ ఎప్పుడు ఓపెన్ అవుతుందో చెప్పలేమని మీసేవా కేంద్రం నిర్వాహకులు చెప్పేశారు. దీంతో ఇక ఈ పథకంలో కింద తనకు అవకాశం లేనట్లేనని రాము ఆవేదన వ్యక్తం చేశాడు. గత వైసీపీ ప్రభుత్వం ఈ పరిస్థితిని నివారించడానికి చర్యలు తీసుకోకపోవడమే దీనికి కారణం.

కర్నూలు, నంద్యాల జిల్లాలో 7 లక్షల మంది రైతులు ఉంటే కేవలం 3 లక్షల మంది రైతులకు మాత్రమే ఈ పథకం కింద డబ్బులు బ్యాంకు ఖాతాలకు జమ అవుతున్నాయి. దాదాపు 4 లక్షల మంది రైతులు వివిధ కారణాల వల్ల పీఎం కిసాన్ నిధి పథకానికి అర్హత లేకుండా పోతున్నారు. ఆచరణలో ఈ పథకం నిరర్థకంగా తయారైందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

● ఏటా తగ్గిపోతున్న లబ్ధిదారుల సంఖ్య

ఈ నెల 18వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసిలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద 17వ విడత నిధులను విడుదల చేశారు. కర్నూలు జిల్లాలో 2,34,000 మంది రైతులకు గాను రూ.46.97 కోట్లు ఒక్కో రైతుకు రూ.2వేల చొప్పున 17వ విడత డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాలకు విడుదల చేశారు. అదే విధంగా నంద్యాల జిల్లాలో 1,95,000 మంది రైతులకు రూ.39.19 కోట్ల నిధులను రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. రెండు జిల్లాల్లో 4 లక్షల మంది రైతులకు రూ.86.16 కోట్లను విడుదల చేశారు. ఈసారైనా తమకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా 17వ విడత రూ.2వేలు బ్యాంకు ఖాతాలకు జమ అయ్యాయేమోనని రైతులు బ్యాంకుల వద్ద క్యూ కట్టారు. గంటల తరబడి వేచి చూసి చివరకు కౌంటరు దగ్గరకు వెళితే బ్యాంకు సిబ్బంది మీ పాసుబుక్‌లో డబ్బు పడలేదని చెప్తున్నారు. కర్నూలు జిల్లాలో 16వ విడత 2,96,973 మంది రైతులను ఈ పథకం కింద అర్హులుగా చేర్చి రూ.59.30 కోట్ల నిధులను వారి బ్యాంకు ఖాతాలకు జమ చేర్చారు. 17వ విడత మంగళవారం రూ.2.34 లక్షల మంది రైతులకు మాత్రమే ఈ పథకం కింద రూ.46.97 కోట్ల నిధులను జమ చేశారు. 16వ విడత విడుదల చేసిన నిధులతో పోలిస్తే.. రూ.12.42 కోట్ల నిధులను తగ్గించేశారు. 62,120 మంది రైతులను అకారణంగా జాబితా నుంచి తొలగించేశారు. నంద్యాల జిల్లాలో కూడా దాదాపు 50వేల మంది రైతులకు సంబంధించి అర్హులైన రైతులను జాబితా నుంచి తొలగించారు. దాదాపు రూ.9 కోట్ల నిధులకు కోత పెట్టేశారు.

● కొత్త వాళ్లకు నో చాన్స్

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని 2019లో ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి దాకా ఈ పథకంలో మొదట్లో ఉన్న వారు తప్పితే.. కొత్తవారికి పథకం ద్వారా లబ్ధి కలగడం లేదు. ఇందులో కొత్తవారు చేరేందుకు వెబ్‌ల్యాండ్ యాప్ ఇప్పటి దాకా ఓపెన్ కాలేదు. దీంతో రైతులు వ్యవసాయాధికారుల కార్యాలయాల చుట్టూ, మీసేవా కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. జాబితాలో పాతవారిని తొలగించేస్తూ కొత్తవారు ఏ చేరే అవకాశం లేకుండా చేయడంతో రైతులు వ్యవసాయాధికారుల చుట్టూ తిరుగుతున్నారు. కేంద్ర ప్రభుత్వం పథకం ద్వారా సంవత్సరంలో మూడు విడతలుగా ఒక్కో విడతకు రూ.2వేల చొప్పున రూ.6వేల మొత్తాన్ని పెట్టుబడి సాయం కింద అందిస్తూ వస్తోంది.



● నిర్లక్ష్యంతో గత వైసీపీ ప్రభుత్వ కాలయాపన

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకంలో ఏపీలో అర్హులైన రైతులంతా లబ్ధి పొందేందుకు చర్యలు చేపట్టడంలో గత వైసీపీ ప్రభుత్వం విఫలమైందనే విమర్శలు ఉన్నాయి. ఏటా పాత జాబితాలో చోటు దక్కించుకున్న రైతులను అనర్హులుగా తొలగిస్తున్నారు. కొత్తగా పొలాలు కొనుక్కున్న రైతులకు లబ్ధిదారుల జాబితాలో చోటు దక్కడం లేదు. ఈ సమస్యలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకొని అర్హులైన రైతులకు ఈ పథకంలో లబ్ధి చేకూర్చడానికి ప్రయత్నించలేదు. తెలుగుదేశం ప్రభుత్వమైనా తమకు న్యాయం చేస్తుందని రైతులు ఆశిస్తున్నారు.

'బాబుప్రసాద్ మృతి కేసులో వైసీపీ నేత హస్తం'

అవుకు, జూన్ 25 : నంద్యాల జిల్లా అవుకు పట్టణం ఈబీసీ కాలనీకి చెందిన బాయకాటి బాబుప్రసాద్ మృతి కేసులో వైసీపీ నేత చల్లా విక్రాంత్‌రెడ్డి, డ్రైవర్ సురేంద్ర, సునీల్ వ్యక్తుల హస్తం ఉన్నట్లు మృతుడి తల్లి వరలక్ష్మమ్మ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. బాబుప్రసాద్ సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలసిందే. బాబుప్రసాద్, అతని ఇంటి పక్కన ఉన్న వారు స్థలం విషయంలో గొడవపడ్డారు. ఈ విషయంపై చల్లా విక్రాంత్‌రెడ్డి పంచాయతీ చేసి బాబుప్రసాద్‌ను బెదించినట్లు కుటుంబసభ్యుల వాదన. ఈనెల 24వతేదీ మధ్యాహ్నం 12-30 గంటలకు బాబుప్రసాద్ అవుకు రిజర్వాయర్ పాలేరు స్లూయిస్ గేట్లపై నుంచి కిందపడి తలకు బలమైన గాయమై చనిపోయినట్లు పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. తల్లీ, కుటుంబసభ్యులు మాట్లాడుతూ బాబుప్రసాద్ ఆత్మహత్య చేసుకోలేదని హత్యచేసి రిజర్వాయర్ గేట్లపై నుంచి కిందికి పడేశారని ఆరోపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సాయంత్రం 4గంటల ప్రాంతంలో బనగానపల్లె సీఐ తిమ్మారెడ్డి, అవుకు ఎస్ఐ కిరణ్‌బాబు పర్యవేక్షణలో డాక్టర్లు పోస్టుమార్టం నిర్వహించారు. తల్లి వరలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు చల్లా విక్రాంత్‌రెడ్డి, డ్రైవర్ సురేంద్ర, సునీల్ ముగ్గురిపై 302 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్‌బాబు తెలిపారు.

చిరుతపులి దాడిలో మహిళ మృతి

శిరివెళ్ల, జూన్ 25: నంద్యాల-గిద్దలూరు రహదారిలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న పచ్చర్ల గ్రామంలో చిరుతపులి దాడి చేసిన ఘటనలో ఓ మహిళ మృతి చెందింది. మహదేవపురం మజరా గ్రామమైన పచ్చర్లకు చెందిన షేక్.మెహరున్నిసా(40) కట్టెల కోసం మంగళవారం అడవిలోకి వెళ్లింది. అటవీ ప్రాంతంలోని వాగు సమీపంలో కట్టెలు సేకరించుకుంటుండగా చిరుతపులి ఆమె తలపై దాడి చేయడంతో గట్టిగా కేకలు వేసింది. చుట్టుపక్కల కట్టెలు సేకరిస్తున్న మహిళలు వచ్చేసరికి మెహరున్నిసాను చిరుతపులి అడవిలోకి లాక్కెళ్లింది. ఈ ఘటనలో మెహరున్నిసా తీవ్ర గాయాలపాలై మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న పచ్చర్ల ఫారెస్టు రేంజి ఆఫీసర్ ఈశ్వరయ్య అటవీ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మూడు రోజుల క్రితం పచ్చర్లలోని ఓ మహిళపై చిరుతపులి దాడికి యత్నించిందని అన్నారు. దీంతో చిరుతను పట్టుకునేందుకు ట్రాప్ కెమెరాలు, బోన్‌లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

రైలు కిందపడి మహిళ ఆత్మహత్య

ఆదోని టౌన్, జూన్ 25: ఆ తల్లికి ఏ కష్టం వచ్చిందో కానీ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. రైల్వే పోలీసు స్టేషన్ ఎస్సై గోపాల్ తెలిపిన వివరాలు మేరకు.. ఆదోని-నగరూరు రైల్వే స్టేషన్ల మధ్య మంగళవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో 30 ఏళ్ల వయస్సు కలిగిన ఓ మహిళ ఆదోని-నగరూర్ రైల్వేస్టేషన్లో మధ్య 493/10 కి.మీ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యచేసుకున్నట్టు తెలిపారు. ఆమె దగ్గర ఎలాంటి గుర్తింపు ఆధారాలు లేవని అన్నారు. లైట్ రెడ్ కలర్ లెగ్గిన్, బ్లూ రంగు డాట్స్ గల గులాబీ టాప్ ధరించి ఉందన్నారు. వివరాలు తెలిసినవారు తన నెంబర్ 849157634కు సమాచారం ఇవ్వాలని అన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 25: తను ప్రేమిస్తున్న అమ్మాయిని పెళ్లి చేసుకుంటానో లేదోనన్న ఆందోళనతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న అత్యంత విషాదకర సంఘటన కొలిమిగుండ్లలో మంగళవారం జరిగింది. గ్రామంలోని ఎంఈవో కార్యాలయం సమీపంలో నివసిస్తున్న ఎరికలి సింహాద్రి(19) ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. సీఐ గోపినాథ్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గనుల శాఖ తనిఖీలు

కర్నూలు(అర్బన్), జూన్ 25: చైతన్య ప్రాజెక్టు కార్యాలయంలో గనుల శాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. మంగళవారం ఉద యం కోడుమూరు మండలం గోరంట్ల గ్రామంలో డిప్యూటి డైరెక్టర్ రాజశేఖర్, విజిలెన్స్ ఏడీ బైరాగి నాయుడు ఆధ్వర్యంలో రికార్డులు పరిశీలించారు. గాలిమరల నిర్మాణం ప్రాజెక్టు కోసం గ్రావెల్, ఇతర ముడిసరుకు ఏమేర తరలించారనే దానిపై అడిగి తెలుసుకుని, సదరు ప్రాజెక్టు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. విచారణ అనంతరం రాయల్టీలతోపాటు పెనాల్టీలను వసూలు చేస్తామని తెలిపారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి



సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న జడ్జి వెంకటేశ్వరరావు

ఆత్మకూరు, జూన్ 25: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జూన్ 29న జరిగే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని కక్ష్యిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక కోర్టు హాలులో పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జూలై 29న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేయదగ్గ కేసులను పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని ఆదేశించారు. ప్రత్యేకించి క్రిమినల్, చెక్‌బౌన్స్ భార్యాభర్తల పంచాయతీలు, పది లీటర్లలోపు లిక్కర్ కేసులు వంటి వాటిని లోక్ అదాలత్‌లో పరిష్కరింపజేయాలని పేర్కొన్నారు. ఆయా కేసులకు సంబంధించి కక్షిదారులతో చర్చించి వీలైనంతవరకు కేసులను లోక్‌అదాలత్‌లో రాజీ చేయించాలని వారికి సూచించారు.

నంద్యాల పెద్ద మార్కెట్ అభివృద్ధికి కృషి



పెద్ద మార్కెట్‌ను పరిశీలిస్తున్న ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల (నూనెపల్లె), జూన్ 25: నంద్యాల గాంధీ చౌక్‌లోని పెద్ద మార్కెట్‌లోని సమస్యలను పరిష్కరించి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. మంగళవారం జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డిలతో కలిసి ఫిరోజ్ పెద్దమార్కెట్‌ను సందర్శించారు. అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూరగాయలు, పండ్లు, నిత్యావసర వస్తువుల వ్యాపారులలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పెద్దమార్కెట్ అభివృద్ధిపై ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు అధికారులతో వచ్చానని అన్నారు. అందరి సలహాలతో కార్యాచరణ రూపొందించి మార్కెట్ అభివృద్ధికి శ్రీకారం చుడతామన్నారు.

ప్రతి మంగళవారం గొర్రెలు, మేకల మార్కెట్

పాణ్యం, జూన్ 25 : ప్రతి మంగళవారం పాణ్యంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గొర్రెలు, మేకల సంత జరుగుతుందని కమిటీ కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం గొర్రెలు, మేకల మార్కెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా మార్కెట్ అధికారుల ఆదేశాల మేరకు పాణ్యంలో మార్కెట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ రహదారి పక్కనే మార్కెట్ ఉండడంతో రైతులు, వ్యాపారులకు అనుకూలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ షాబీర్‌బాషా, గ్రేడర్ పద్మరాజు, జేఎంఎస్ నాగపుల్లయ్య, సెక్యూరిటీ గార్డులు, యార్డు సహాయకులు పాల్గొన్నారు.

కళాకారుల సమస్యలు పరిష్కరించండి

గడివేముల, జూన్ 25: జానపద చెక్కభజన కళాకారుల సమస్యలు పరిష్కరించాలని కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నగిరి వెంకటేశ్వర్లు యాదవ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. నగిరి వెంకటేశ్వర్లు యాదవ్ మంగళవారం ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ స్వగృహంలో కలిసి కళాకారుల సమస్యలను వివరించారు. గుర్తింపు ఉన్న కళాకారులకు పింఛన్లను అందజేయాలని కోరారు. కళాకారుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

గడివేముల, జూన్ 25: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. మంగళవారం ఆయన టీడీపీ మండల అధ్యక్షుడు ఇంటి వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు జూలై నెల నుంచి పెంచిన పింఛన్‌ను అందించడం జరుగుతుందని అన్నారు. మెగా డీఎస్సీ ద్వార 16,347 పోస్టులను భర్తీ చేస్తున్నారని అన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి రైతులకు అండగా ఉంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల (నూనెపల్లె), జూన్ 25: గతంలో మున్సిపల్ పరిధిలో పని చేసిన మున్సిపల్ ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ సమస్యను పరిష్కరించాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామచంద్రారెడ్డి, శివయ్యలు కోరారు. మంగళవారం నంద్యాల మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డిని ఏపీటీఎఫ్ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు దస్తగిరి, గాలయ్య, నౌమాన్‌బాషా, షరీఫ్ పాల్గొన్నారు.

బాధితుడికి న్యాయం చేయండి

నంద్యాల రూరల్, జూన్ 25.. గోస్పాడు మండల యాళ్ళూరు గ్రామ కార్యదర్శి సుబ్బారావు నిర్లక్ష్యం వల్ల ఇల్లు కూలిపోయిన చెన్నయ్యకు న్యాయం చేయాలని సీపీఐ మండల నాయకులు ఆర్డీవో మల్లికార్జునరెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. గోస్పాడు మండల యాళ్లూరు గ్రామానికి చెందిన చెన్నయ్య ఇంటి సమీపాన వెంకటేశ్వర్లు తన ఇంటి మరుగు దొడ్డి నిర్మాణం కోసం గుంత తవ్వడంతో కూలిపోయిందని వివరించారు. న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి

నంద్యాల టౌన్, జూన్ 25 : రైతు బజార్లలో ఏర్పడిన గుంతలను చదును చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం శ్రీనివాసనగర్, టెక్కె, గాంధీచౌక్‌లోని రైతు బజార్లను జాయింట్ కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రైతు బజార్లను పరిశీలిస్తూ ప్రతి రోజు ఎంత మంది వస్తున్నారు, కూరగాయలు, పండ్ల ధరలు ఏలా ఉన్నాయనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. బయటి ప్రాంతంలో రైతులు విక్రయించకుండా రైతు బజార్లల్లోనే కూరగాయలు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని జేసీ ఆదేశించారు. జేసీ వెంట మున్సిపల్ కమీషనర్ నిరంజన్‌రెడ్డి, మార్కెటింగ్ ఏడీ అబ్దుల్ రెహమాన్, అధికారులు ఉన్నారు.



వ్యాపారులతో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

పనులను వేగవంతం చేయండి

జూపాడుబంగ్లా, జూన్ 25: పనులకు ఎటువంటి ఆటంకం లేకుండా వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ రాహూల్‌కుమార్‌రెడ్డి అధికారుల ను ఆదేశించారు. మండలంలోని మండ్లెం, తంగడంచ గ్రామాల్లో నిలిచిన పనులను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. జాతీయ రహదారి విస్తర ణలో పోయిన పెట్రోల్ బంకు తొలగించకపోవడంతో పనులకు ఆటంకం కల్గించకూడదని, ఏమైనా సమస్య ఉంటే ఫిర్యాదు చేసుకోవాలని, పరిహారం రాకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసుకోవాలని సూచించారు. మండ్లెం గ్రామంలో గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ భవనం తొలగించాలని, ఆ సమయంలో గ్రామంలో దండోరా వేయించాలని ఆర్డీవో దాసుకు ఆదేశించారు. తంగడంచ సమీపంలోని సెరికల్చర్ కార్యాలయం వద్ద పనులను పరిశీలించారు. కార్య క్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాగన్న, ఆర్ఐ శ్రీరంగారెడ్డి పాల్గొన్నారు.



పెట్రోల్ బంకు యజమానులతో మాట్లాడుతున్న జేసీ

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై హర్షం

ఆత్మకూరు, జూన్ 25: అనాలోచిత నిర్ణయాలతో గత వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను ప్రస్తుత కూటమి ప్రభుత్వం రద్దు చేయడాన్ని హర్షిస్తూ మంగళవారం ఆత్మకూరు పట్టణంలోని సీనియర్, జూనియర్ సివిల్ కోర్టుల పరిధిలోని న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం అధ్యక్షులు వేముల వెంకటేశ్వర్లు, కార్యదర్శి రవికుమార్, సీనియర్ న్యాయవాదులు కంచర్ల గోవిందరెడ్డి, కేశవరెడ్డి, గిరిరాజు తదితరులు మాట్లాడుతూ ఒకప్పుడు భూ యాజమాన్య హక్కుల ధ్రువీకరణ పత్రాల్లో ఏదైనా అన్యాయం జరిగితే కోర్టులను ఆశ్రయించే అవకాశం ఉండేదని అన్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ యాజమాన్య చట్టం ద్వారా కోర్టులతో సంబంధం లేకుండా తహసీల్దార్, ఆర్డీవోలను టైటిలింగ్ ఆఫీసర్లుగా నియమించారని తెలిపారు. దీని వల్ల భూకబ్జాలు అధికమవడంతోపాటు పేదలకు న్యాయం జరిగే ప్రసక్తే ఉండదని తెలిపారు. ఈచట్టంపై ప్రజల్లో వ్యతిరేకత ఉన్నప్పటికీ వైసీపీ పాలకులు ఏకపక్షంగా వ్యవహరించారని మండిపడ్డారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరించిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తూ నిర్ణయించడం సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు లక్ష్మీనారాయణ, నూర్‌అహ్మద్, రహిమాన్, మహబూబ్ బాషా, ఆసీఫ్‌అలిఖాన్, నరసింహులు, బతుకులయ్య తదితరులు ఉన్నారు.



ఆత్మకూరులో హర్షం వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

శ్రీశైలంలో విశేష పూజలు

శ్రీశైలం, జూన్ 25: శ్రీశైలం మహాక్షేత్రంలో మంగళవారం లోక కళ్యాణార్థం ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య (కుమారస్వామి) స్వామికి, నందీశ్వరస్వామికి, బయలు వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో దేశం శాంతిసౌభాగ్యాలతో విరిసిల్లాలని అర్చకులు సంకల్పం పఠించారు, అనంతరం పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతికి పూజలు చేశారు. అనంతరం పంచామృతాలతో అభిషేకించి మంగళహారతులు సమర్పించారు.





పూజలందుకున్న నందీశ్వరుడు, సుబ్రహ్మణ్య స్వామి

● **ఆకట్టుకున్న నిత్య కళారాధన**

శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో మంగళవారం నందికొట్కూరుకు చెందిన సాయి నృత్య కళా శాల బృందంచే కూచిపూడి నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడ వీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వినాయకకౌత్వం, మూషిక వాహన, శివశివ శంకరా, గంగాధర శివ, జతిస్వరం, శివోహం తదితర గీతాలకు వెంకట పూజిత, జయలక్ష్మి, వరలక్ష్మి, వశి కమల, అమృత, అక్షయ, లక్ష్మి తదితరులు నృత్య ప్రదర్శనతో భక్తులను ఆకట్టుకున్నారు.



బయలు వీరభద్ర స్వామికి పూజలు



నృత్యం చేస్తున్న కళాకారులు

వైభవంగా అష్టదళ పాద పద్మారాధన





పూజలందుకున్న లక్ష్మీవెంకటేశ్వర స్వామి, కాళికాంబ అమ్మవారు

నంద్యాల కల్చరల్, జూన్ 25: నంద్యాల పట్టణంలోని సంజీవనగర్ కోదండ రామాలయంలో భగవత్ సేవా సమాజ్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు ఉదయాన్నే సుప్రభాతసేవ, పంచామృత అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం స్వామివారిని పట్టు వస్త్రాలతో అలకంరించి వివిధ రకాల పుష్పాలచే పూజలు నిర్వహించారు. 108 రకాల వెండి పుష్పాలచే అష్టదళ పాదపద్మారాధన సేవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామివారికి హారతి ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు సముద్రాల సూరయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాళీమాత అమ్మవారికి: నంద్యాల గాంధీచౌక్‌లో వెలసిన కాళికాంబ అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 వెండి పుష్పాలచే అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హారతి ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్తు చిత్తు

గడివేముల, జూన్ 25: మత్తు పదార్థాలను వినియోగించడం వలన భవిష్యత్తు అంధకారంగా మారుతుందని ఎస్ఐ బీటీ వెంకట సుబ్బయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉపకరణాల పంపిణీ

నంద్యాల రూరల్, ఏప్రిల్ 21 : విద్యుత్ సిబ్బందికి ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఉపకరణాలను పంపిణీ చేశారు. మంగళవారం విద్యుత్ కార్యాలయంలో ఆర్యవైశ్య జిల్లా కమిటీ అధ్యక్షుడు నాగమహేష్ మాట్లాడుతూ వర్షాకాల నేపథ్యంలో విద్యుత్ సిబ్బంది రక్షణ కోసం ఉపకరణాలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో విజయశేఖర్, విద్యుత్ శాఖ ఏడీ సతీష్‌కుమార్, ఏఈలు రామయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

29న ఎంపిక పోటీలు

నంద్యాల (నూనెపల్లె), జూన్ 25: ఈ నెల 29వ తేదీన రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో అండర్ 19 బాల బాలికల జిల్లా చెస్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రవికృష్ణ, ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి తెలిపారు. 9010451585 నంబరుకు సంప్రదించాలని కోరారు.

ప్రధానిని కలిసిన ఎంపీ బైరెడ్డి శబరి



ప్రధానిని కలిసిన ఎంపీ బైరెడ్డి శబరి కుటుంబ సభ్యులు

నందికొట్కూరు, జూన్ 25: ఢిల్లీలోని పార్లమెంట్ భవనం ఆవరణలో ప్రధానమంత్రి కార్యాలయంలో మంగళవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, ఆమె కటుంబ సభ్యులతో మర్యాద పూర్వకంగా కలిశారు. నంద్యాల ఎంపీగా ఎన్నికైన అనంతరం మొదటిసారిగా మోదీని కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. నంద్యాల పార్లమెంట్‌కు గొప్ప విశ్షత ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారని బైరెడ్డి శబరి వివరించారు. నంద్యాల ఎంపీలుగా ఎన్నికైన నీలం సంజీవరెడ్డి రాష్ట్రపతిగాను, పీవీ నరసింహారావు ప్రధాన మంత్రిగా, పెండెకంటి వెంకట సుబ్బయ్య కేంద్ర మంత్రిగా, గవర్నర్‌గా చేసి ఉత్తమ పార్లమెంటేరియన్‌లుగా నంద్యాలకు గుర్తింపు తెచ్చారని ఆయన తెలిపినట్లు పేర్కొన్నారు. మోదీని కలిసిన వారిలో ఎంపీ కుటుంబ సభ్యులు శివచరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, బైరెడ్డి భారతమ్మ, బైరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, బైరెడ్డి శర్వాని ఉన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



సీఐటీయూ కార్యాలయంలో మాట్లాడుతున్న నాయకులు

నందికొట్కూరు, జూన్ 25: బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని సీఐటీయూ నంద్యాల జిల్లా అధ్యక్షుడు యేసురత్నం అన్నారు. మంగళవారం నందికొట్కూరు పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వ పరిశ్రమలను కారుచవుకగా కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తోందని అన్నారు. కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, కార్మికులు స్కీం వర్కర్లు కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జూలై 10న జరిగే డిమాండ్స్ డే లో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో భాస్కర్‌రెడ్డి, గోపాలకృష్ణ, నాగన్న, నజీరునిస్సా, చిన్న రోశమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం పనులపై దృష్టి పెట్టాలి

పగిడ్యాల, జూన్ 25: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం పనులపై సిబ్బంది దృష్టి కేంద్రీకరించాలని ఎంపీడీవో కవిరాజు అన్నారు. పగిడ్యాల ఎంపీడీవో కార్యాలయంలో ఆరోగ్య సిబ్బంది, వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నీటి ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి మోహన్, ఈవోఆర్డీ నాగేంద్రమయ్య పాల్గొన్నారు.

సులభ్ కాంప్లెక్స్‌లు నిర్మించాలి



కమిషనర్‌కు నమస్కరిస్తున్న వ్యాపారులు

నంద్యాల టౌన్, జూన్ 25 : నంద్యాల పట్టణంలో 10వ వార్డు పరిధిలో ప్రముఖ వ్యాపారాలకు నిలయంగా ఉన్న బైర్మల్ వీధి, బంగారు అంగళ్ల వీధి, గాంధీచౌక్, కల్పనా సెంటర్లకు వచ్చే ప్రజల సౌకర్యార్థం సులబ్ కాంప్లెక్స్ నిర్మించాలని వివిధ వ్యాపార సంస్థల ప్రతినిధులు కోరారు. మంగళవారం టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, 10వ వార్డు టీడీపీ ఇన్‌చార్జీ బోయ గోవిందనాయుడు ఆధ్వర్యంలో వ్యాపార ప్రతినిధులు కమీషనర్ నిరంజన్ రెడ్డిని కలిసి విన్నవించారు. ప్రతి రోజూ వందలాది మంది తమ తమ అవసరాల నిమిత్తం ఈ ప్రాంతాలకు వస్తుంటారని, మరుగుదొడ్లు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారని కమిషనర్‌కు వివరించారు. మున్సిపల్ హైస్కూల్ పక్కన ఉన్న మరుగుదొడ్ల స్థానంలో సులబ్ కాంప్లెక్స్ నిర్మిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కోరారు. ఈ విషయంపై కమిషనర్ సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు బోయ గోవిందనాయుడు వెల్లడించారు. కార్యక్రమంలో బైర్మల్‌వీధి, గాంధీచౌక్, కల్పనా సెంటర్, బంగారు అంగళ్ళ వీధులకు చెందిన వివిధ వ్యాపార సంస్థల ప్రతినిధులు, పలువురు పాల్గొన్నారు.

ఆలమూరు సర్పంచ్‌గా మనోహర్

పాణ్యం, జూన్ 25: మండలంలోని ఆలమూరు గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా గొల్ల మనోహర్ బాధ్యతలు చేపట్టారు. మంగళవారం ఆలమూరు సచివాలయంలో ఈఓఆర్‌డీ సులోచన సర్పంచ్ బాధ్యతలను అప్పజెప్పారు. 2021 ఫిబ్రవరిలో సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎం.షరీఫ్ ఈ నెల 10 తేదీన అనారోగ్య కారణాలతో సర్పంచ్ పదవికి రాజీనామా చేశాడు. దీంతో సర్పంచ్ పదవికి ఖాళీ ఏర్పడింది. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు మంగళవారం ఉప సర్పంచ్‌గా కొనసాగుతున్న మనోహర్‌ను సర్పంచ్‌గా పంచాయతీ వార్డు సభ్యుల ఆధ్వర్యంలో సర్పంచ్‌గా బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగమణి, మాజీ ఎంపీటీసీ, సొసైటీ మాజీ డైరెక్టర్ చంద్రశేఖరెడ్డి పాల్గొన్నారు.

జూన్ 25 చీకటి దినం: బీజేపీ

నంద్యాల కల్చరల్, జూన్ 25 : జూన్ 25వ తేదీ భారతదేశ ప్రజలకు ఒక చీకటి దినమని నంద్యాల బీజేపీ జిల్లా కోఆర్డినేటర్ అభిరుచి మధు అన్నారు. నంద్యాల రామక్రిష్ణా డిగ్రీ కాలేజీ ఆడిటోరియంలో మంగళవారం బీజేపీ కేంద్ర రాష్ట్ర సూచన మేరకు ఎమర్జెన్సీ వ్యతిరేక దినం నిర్వహించారు. 1975వ సంవత్సరం జూన్ 25న ప్రజల హక్కులను కాలరాస్తూ అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ తన సొంత అజెండాతో కొన్ని లక్షల మందిని జైలు పాలు చేసిందని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఇంటి ఆదినారాయణ, కోశెట్టి క్రిష్ణమూర్తి, చంద్రశేఖర్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు రామక్రిష్ణారెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బత్తిన స్వాతి, తూము శివారెడ్డి, గురుబ్రహ్మం, లక్ష్మీరెడ్డి, ఉపేంద్రరెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

పాణ్యం, జూన్ 25: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రిని రాష్ట్ర ప్రభుత్వ కళాశాలల జాయింట్ డైరెక్టర్ సస్పెండ్ చేసినట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. కళాశాల పీడీ డాక్టర్ విజయభారతి, ఇంగ్లీషు అధ్యాపకురాలు డాక్టర్ ఫరీదాబేగంలు తమను వేధిస్తూ మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్న ఫిర్యాదు మేరకు సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం

నందికొట్కూరు, జూన్ 25: విద్యార్థి దశలో మత్తు పదార్థాలకు అలవాటైతే భవిష్యత్తు నాశనమవుతుందని నందికొట్కూరు పట్టణ సీఐ ప్రకాష్ కుమార్ అన్నారు. మంగళవారం డ్రగ్ వినియోగం వల్ల జరిగే అనర్థాలపై పట్టణంలోని బనిరెడ్డి డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సీఐ అన్నారు.

చర్యలు తీసుకోవాలి

వెలుగోడు, జూన్ 25: ప్రజలు అనారోగ్యానికి గురి కాకుండా గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకో వాలని జనసేన నాయకులు షాలు బాషా, సుకన్య కోరారు. మంగళవారం వారు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈగలు దోమలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని, డ్రైనేజీలలో పూడికలు తీయాలని కోరారు.

ఆలయ పనుల పరిశీలన

పగిడ్యాల, జూన్ 25: నంద్యాల పార్లమెంటు టీడీపీ జిల్లా మహిళ అధ్యక్షురాలు పార్వతమ్మ మండల పరిధిలోని నెహ్రూనగర్‌లో నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి దేవాలయ పనులను పరిశీలించారు. దాతల సహకారంతో దేవాలయ నిర్మాణం చేపట్టడం గొప్ప విషయమన్నారు. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో హేమసుందరరాజు, విజేయుడు, శ్రీను, గంగన్న, కృష్ణయ్య, రాము ఉన్నారు.

ఈద్గా ప్రహరి నిర్మాణంలో వివాదం

పగిడ్యాల, జూన్ 25: మండల పరిధిలోని పడమర ప్రాతకోట గ్రామంలోని ఈద్గా వద్ద ప్రహరీ నిర్మాణంలో వివాదం నెలకొంది. ఈద్గా సమీపంలోని పొలం రైతు ప్రహరి నిర్మాణానికి అడ్డు చెప్పడంతో ముస్లింలు ముచ్చుమర్రి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వారిని స్టేషన్‌కు పిలిపించి సమస్యలను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకో వాలని సూచించారు.

కంటి వైద్య శిబిరం ప్రారంభం

ఆత్మకూరు, జూన్ 25: పట్టణంలోని డాక్టర్ సత్యానారాయణ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మంగళవారం డాక్టర్ సత్యనారాయణ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు మోమిన్ షబాన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డాక్టర్ సత్యనారాయణ కుటుంబ సభ్యులు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. గరిమెళ్ల శ్రీనివాసశర్మ మాట్లాడుతూ ఈనెల 25 నుంచి జూలై 1వ తేదీ వరకు కంటి పరీక్షలు నిర్వహించి కళ్ల జోళ్లు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 29 నుంచి జూలై 3వ తేదీ వరకు ఆపరేషన్లు చేసేలా వెసులుబాటు కల్పించనున్నట్లు వివరించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

అంకిరెడ్డిపల్లెకు అందని శుద్ధ జలం

- ఫ్లోరైడ్ నీటితో అల్లాడుతున్న పేద ప్రజలు
- దత్తత గ్రామాన్ని ఆదుకోని అల్ట్రాటెక్ పరిశ్రమ

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 25: మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామ ప్రజలకు శుద్ధజలం అందడం లేదు. దీంతో గ్రామంలోని పేద ప్రజలు ఫ్లోరైడ్ వాటరే తాగి అనారోగ్యం పాలవుతున్నారు. 7వేల జనాభా ఉన్న అంకిరెడ్డిపల్లె గ్రామంలో మంచి నీటి సమస్య తీవ్రంగా ఉంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజా ప్రతినిధులు పట్టించుకోక పోవడం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అందుబాటులో వున్న 5 శుద్ధ జల కేంద్రాలు మూతపడ్డాయి. 2014 ఎన్నికల్లో బీసీ విజయం సాధించిన తరువాత ఎన్‌టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని కొలిమిగుండ్ల మండలంలో అందుబాటులోకి తీసుకవచ్చి అన్ని గ్రామాలకు స్వచ్ఛమైన శుద్ధజలాన్ని అందించారు. అయితే 2019 తరువాత అధికారం చేపట్టిన వైసీపీ ఈ పథకంపై కక్షగట్టి మూతపడేలా చేసింది. దీంతో గ్రామంలో ఎన్‌టిఆర్ సుజల స్రవంతి మినీ ట్యాంక్‌తో పాటు గ్రామంలోని ఇతర శుద్ధ జల కేంద్రాలు గత నాలుగేళ్లుగా పనిచేయడం లేదు. దీంతో తాడిపత్రి మండలం నుంచి ఆటోల్లో అమ్మకానికి వచ్చే శుద్ధజలం 15లీటర్ల క్యాన్ రూ.10 వెచ్చించి ప్రజలు కొంటున్నారు.

ఆదుకోని అల్ట్రాటెక్ పరిశ్రమ: సామాజిక బాధ్యతలో భాగంగా గ్రామాలను ఆదుకుంటామని గొప్పలు చెప్పుకుంటున్న అల్ట్రాటెక్ పరిశ్రమ అంకిరెడ్డిపల్లె ప్రజలకు శుద్ధ జలాన్ని అందించడంలో విఫలమైంది. గత 6ఏళ్ల క్రితం ఎంతో ఆర్భాటంగా గ్రామంలో శుద్ధ జలకేంద్రం ఏర్పాటుచేసిన కంపెనీ ప్రతినిధులు పట్టుమని 10నెలలు కూడా నీరు అందివ్వలేదు.



మూత పడిన అల్ట్రాటెక్ మినరల్ వాటర్ ప్లాంటు

కంపెనీ ఆదాయంలో లక్షలాది రూపాయలు ప్రజల కోసం ఖర్చు చేస్తున్నామని గొప్పలు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇలా ఉంది.

శుద్ధజలం అందించలేకపోవడం బాధాకరం



ప్రజలకు కనీస అవసరమైన శుద్ధజలం అందించలేక పోవడం బాధాకరం. ముఖ్యంగా అల్ట్రాటెక్ పరిశ్రమ అంకిరెడ్డిపల్లెను దత్తత గ్రామమని చెప్పుకోవడం తప్ప చేసిందేమీ లేదు.

- బాలరంగయ్య, అంకిరెడ్డిపల్లె

అంబేడ్కర్ విద్యావిధానం అమలుపై హర్షం



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న టీడీపీ ఎస్సీ, ఎస్టీ సెల్ నాయకులు

బేతంచెర్ల, జూన్ 25: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అంబేడ్కర్ విదేశీ విద్య విధానాన్ని అమలు చేయడంపై ఎస్సీ, ఎస్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రూబెన్, రాష్ట్ర టీడీపీ క్రిస్టియన్ సెల్ కార్యదర్శి మేకల నాగరాజు, టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రవీంద్రనాయక్ సమక్షంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన విద్యార్థులకు జగనన్న విదేశీ విద్యా విధానాన్ని ప్రవేశ పెట్టడం హేయమైన చర్య అన్నారు. టీడీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అంబేడ్కర్ విదేశీ విద్యావిదానాన్ని అమలు చేశారన్నారు. జగన్ రెడ్డి రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ పేరును మార్చేసి తన పేరును పెట్టుకోవడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. వార్డు కౌన్సిలర్ రామగోపాల్, లొడ్డ శేఖర్, కొలుములపల్లె నాగరాజు, శ్రీపతి నాగరాజు, కానాల అంజి, ఎస్సీ ఎస్టీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు పరామర్శ



మహ్మద్‌రఫీతో మాట్లాడుతున్న బీసీ రామనాథరెడ్డి

కోవెలకుంట్ల, జూన్ 25: పట్టణంలోని సంతపేటకు చెందిన టీడీపీ కార్యకర్త మహ్మద్‌రఫిని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సోదరుడు బీసీ రామనాథరెడ్డి పరామర్శించారు. టీడీపీ బూత్ కన్వీనర్ సాయి తండ్రి గోనవరం మహ్మద్‌రఫీకి కాలికి గాయం కావడంతో నంద్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న బీసీ రామనాథరెడ్డి మంగళ వారం కోవెలకుంట్లలోని మహ్మద్‌రఫీ ఇంటి వద్దకు చేరుకుని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలికి గాయం నయం అయ్యేంత వరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గడ్డం నాగేశ్వర్‌రెడ్డి, టీడీపీ యువ నాయకులు గడ్డం అమర్‌నాథరెడ్డి, బీసీ సంఘం నాయకుడు బాలాజీ సింగ్ ఉన్నారు.

మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోండి

డోన్(రూరల్), జూన్ 25: ఏపీ మోడల్ స్కూల్‌లో 9వ తరగతికి సంబంధించి ఖాళీగా ఉన్న సీట్లకు ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగజాస్మిన్ సూచించారు. మంగళ వారం కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఏపీ మోడల్ స్కూల్ 9వ తరగతిలో 6 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ నెల 26వ తేదీ ఈ సీట్ల భర్తీకి అర్హత పరీక్ష నిర్వహించాల్సి ఉండగా.. వివిధ కారణాలతో జూలై 1వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 28వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్టడీ సర్టిఫికెట్, ఆధార్, పాస్ కార్డు లతో వచ్చి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

డోన్: డోన్ పట్టణ సమీపంలోని డా.బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో 6వ తరగతిలో మిగిలిన ఎస్సీ, ఎస్టీ సీట్లను భర్తీ చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రావు మంగళ వారం తెలిపారు. అదేవిధంగా 7వ తరగతిలో ఎస్టీ కేటగిరిలో ఖాళీగా ఒక సీటును భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 28వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుకు రెండు ఫొటోలతోపాటు ఆధార్ కార్డు నకలు జత పరచాలని తెలిపారు. ఈ నెల 29న ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని ప్రిన్సిపల్ తెలిపారు.

రేపు అయ్యప్పస్వామి ఆలయ పదో వార్షికోత్సవం

బేతంచెర్ల, జూన్ 25: పట్టణ శివారులోని నంద్యాల రహదారిలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయ పదో వార్షికోత్సవం గురువారం నిర్వహించనున్నట్లు అయ్యప్పస్వామి సేవా సమితి సభ్యులు మంగళ వారం తెలిపారు. ఉదయం 7గంటలకు స్వామివారికి పంచా మృతాభిషేకం, 12.30 గంటలకు మహా మంగళహారతి, తీర్థప్రసాద వితరణ, ఒంటి గంటకు భక్తులకు అన్నదానం, సాయంత్రం 5 గంటలకు స్వామివారి గ్రామోత్సవం జరుగుతుందని తెలిపారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

డోన్, జూన్ 25: డోన్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ డాక్టర్ జయరామ్ మంగళవారం తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ సమావేశ భవనంలో జరిగే కౌన్సిల్ సమావేశానికి డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని కమిషనర్ తెలిపారు. కౌన్సిల్ సభ్యులంతా హాజరు కావాలన్నారు.

30న మండల సమావేశం

బనగానపల్లె, జూన్ 25: బనగానపల్లె ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 30న ఉదయం 11గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నాగారాజు మంగళవారం తెలిపారు. ఈసమావేశానికి రోడ్లుభవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఎంపీపీ మాసవీణ అధ్యక్షతన జరిగే ఈసమావేశానికి అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

ఐకమత్యంతో పోరాడాలి

డోన్(రూరల్), జూన్ 25: సమస్యల పరిష్కారం కోసం ఐకమత్యంతో పోరాడాలని ఏపీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్ప, కార్యదర్శి తిరుపాలయ్య, తాలుకా అధ్యక్షుడు చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని పెన్షనర్ల సంఘం కార్యాలయంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. నాయకులు, సభ్యులు శంషాద్ బేగం, పద్మావతి, రాధమ్మ, అరుణ, సునీల్, లక్ష్మణ్ నాయక్, కృష్ణకుమార్ పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవోలు

చాగలమర్రి, జూన్ 25: ప్రైవేటు పాఠశాలలో విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేసినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల అన్నారు. మంగళవారం చాగలమర్రిలోని సేయింట్‌ఆన్స్ రాఘవేంద్ర, చైతన్యభారతి ప్రైవేటు పాఠశాలలను తనిఖీ చేశారు. పాఠశాలల రికార్డులను పరిశీలించారు. వాహనాలకు సంబంధించిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను పరిశీలించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలచే ఫీజుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన దానికంటే అధిక ఫీజులు వసూలు చేయరాదని అన్నారు. వారి వెంట హెచ్‌ఎంలు, సీఆర్పీలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కోవెలకుంట్ల, జూన్ 25: పట్టణంలోని అంబేడ్కర్ గురుకుల బాలికల జూనియర్ కళాశాల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థాని కులు తెలిపిన వివరాలివి.. కోవెలకుంట్ల పట్టణానికి చెందిన విజయ్ అనే వ్యక్తి సబ్ రిజిస్ట్రారు కార్యాలయం పక్కనే ఉన్న కుందూనది నుంచి మోటరు బైకుపై కోవెలకుంట్ల మెయిన్ రోడ్డు ఎక్కుతుండగా కోవెలకుంట్ల నుంచి దొర్నిపాడుకు మోటరు బైకుపై సుబ్బరాయుడు అనే వ్యక్తి వెళ్తుం డగా గురుకుల పాఠశాల సమీపంలోకి వచ్చేసరికి ఎడమ వైపున సైడ్ నుంచి బైకు రావడంతో రెండు మోటరు బైకులు ఢీకొన్నాయి. దీంతో విజయ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సుబ్బరాయుడుకు కుడి మోచేయికి గాయాలయ్యాయి. గాయపడ్డ వీరిని కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

రుద్రవరం, జూన్ 25: ఆళ్లగడ్డ కోర్టు ఆదేశాల మేరకు వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మండలంలోని మందలూరు గ్రామానికి చెందిన ఓబులమ్మకు కోవెలకుంట్ల మండలం చిన్నకొప్పర్ల గ్రామానికి చెందిన పెద్దతిరుపాల్‌తో 2018లో వివాహమైంది. ఈ దంపతులకు ఒక కుమారుడు ఉన్నాడు. అదనపు కట్నం కోసం శారీరకంగా మానసికంగా వేధిస్తున్నట్లు ఓబులమ్మ కోర్టును ఆశ్రయించింది. కోర్టు ఆదేశాల మేరకు భర్త పెద్దతిరుపాలు మరో ఇద్దరిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైతుల ఫిర్యాదు మేరకు విచారణ

రుద్రవరం, జూన్ 25 : మండలంలోని బీరవోలు గ్రామానికి చెందిన రైతు వెంకటపతి విద్యుత్ ఎస్ఈ ఉమాపతికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆళ్లగడ్డ డిప్యూటీ డీఈ రవికాంత్‌చౌదరి మంగళవారం రైతులను విచారించినట్లు తెలిపారు. రైతులు పంట నష్టపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో పంట నష్టపోయామని ఫిర్యాదులో రైతులు పేర్కొన్నట్లు ఆయన తెలిపారు.

తుడుమలదిన్నె ఫీల్డ్ అసిస్టెంట్ రాజీనామా

ఉయ్యాలవాడ, జూన్ 25: మండలంలోని తుడుమలదిన్నె గ్రామ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ మోహన్‌రావు రాజీనామా చేసినట్లు ఏపీవో రవిప్రకాష్ మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్య కారణాల వల్ల విధులు సరిగా నిర్వహించలేక పోతున్నట్లు రాజీనామా పత్రం లో పేర్కొన్నారన్నారు. ఇదిలా ఉండగా ఆ గ్రామ సర్పంచ్ మాబుషరీఫ్, గ్రామ కార్యదర్శి సతీష్ కుమార్‌ల సంతకాలను ఫోర్జరీ చేసి ఉద్యోగం పొందా దని ఈ నెల 24వ తేదీన వారు ఏపీవోకు ఫిర్యాదు చేశారు. అంతలో ఆయన రాజీనామా చేయటం చర్చ నీయాంశమైంది. రాజీనామా పత్రాన్ని ఎంపీడీవోకు బదిలీ చేసినట్లు ఏపీవో తెలిపారు.

కీటక జనిత వ్యాధులపై అవగాహన ర్యాలీ

చాగలమర్రి, జూన్ 25: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో వైద్యులు తస్లీమా సుల్తాన్ ఆధ్వర్యంలో ముత్యాలపాడు, గొడిగనూరు గ్రామాల్లో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, విద్యార్థులు కలిసి కీటక జనిత వ్యాధులపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య విస్తరణాధికారులు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, డయేరియా వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. దోమ కాటుకు గురి కాకుండా దోమ తెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు మనిషా, వెంకటమ్మ, ఏఎన్‌ఎంలు సుభాషిణి, చెంచులక్ష్మి, ఆశాలు పాల్గొన్నారు.

వీల్ చైర్ పంపిణీ

బనగానపల్లె, జూన్ 25: బనగానపల్లె పట్టణానికి చెందిన మనోహర్‌రావు తల్లి రెండు కాళ్లు పోగొట్టుకోవడంతో నడవలేని స్థితిలో ఉండడంతో కాత్యాయని మెడికల్ స్టోర్ యజమాని మారుతికుమార్, నాగార్జునరెడ్డిలు మంగళవారం సీఐ గంటా సుబ్బారావు ఆధ్వర్యంలో వీల్ చైర్ మంగళవారం అందించారు. వీల్‌చైర్ అందించిన కాత్యాయని మెడికల్ స్టోర్ యాజమాన్యానికి మనోహర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు: ఏవో

అవుకు, జూన్ 25: ఎరువులు, పురుగు మందుల వ్యాపారులు నిబం ధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని వ్యవసాయాధికారి అబ్దుల్ హక్ హెచ్చరించారు. మంగళవారం అవుకు పట్టణంలోని శ్రీనివాస, ఎంసీఎస్ ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్‌లు, బిల్లుల పుస్తకాలను పరిశీలించామన్నారు. ప్రభుత్వం నిషేధించిన బయోపెస్టిసైడ్స్‌ను వ్యాపారులు దుకాణాల్లో నిల్వ చేయరాదన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, పురుగు మందులను విక్రయించాలన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఏవో

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సంజామల, జూన్ 25: పశువులకు సోకే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటరమణయ్య పశువైద్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం సంజామల పశువైద్యశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యశాలలోని రికార్డులు, మందులను పరిశీలించారు. అనంతరం ఏడీ మోహన్‌రావుతో కలసి పశువైద్య సిబ్బందికి సలహాలిచ్చారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పశువులకు వ్యాధులు సోకకుండా ముందస్తుగా టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో జేవీవో సుబ్బయ్య, బాషా, మహబూబ్‌బేగ్, ప్రభాకర్, షరీప్ పాల్గొన్నారు.

అవుకు: అవుకు పట్టణంలోని ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవుకు పంచాయతీ ఈవో అశ్వనీకుమార్ అన్నారు. మంగళవారం పంచాయతీ సిబ్బందితో వీధుల్లో పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు దళిత వీధిలోని ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు



సంజామల పశువైద్యశాలలో రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య

మాన్యం కౌలు వేలంలో ఉద్రిక్తత

రంగంలోకి దిగిన పోలీసులు



రుద్రవరం మండలం పేరూరులో ఇరువర్గాలను చెదరగొడుతున్న పోలీసులు

రుద్రవరం, జూన్ 25: రుద్రవరం మండలం పేరూరు గ్రామంలో ఈశ్వర, రామస్వామి, ఆంజనేయస్వామి దేవస్థాన భూముల కౌలు వేలంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. కౌలుకు సంబంధించి దేవదాయశాఖ అధికారులు మంగళవారం డిపాజిట్లు స్వీకరించారు. అయితే అన్యమతస్థులు బహిరంగ వేలంలో పాల్గొనరాదని చెప్పడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. మాటామాట పెరిగి ఇరువర్గాల వారు దాడులు చేసుకున్నారు. ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తన సిబ్బందితో వచ్చి ఇరువర్గాలను చెదరగొట్టారు. దీంతో సమస్య సద్దుమణిగింది. కౌలు వేలం వాయిదా పడింది.

యుద్ధ ప్రాతిపదికన కల్వర్టు పనులు



కల్వర్టును పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి

బనగానపల్లె , జూన్ 25: పాతపాడునుంచి యాగంటి క్షేత్రానికి వెళ్లే రహదారిలో రూ.40లక్షలతో నిర్మిస్తున్న కల్వర్టును రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశాల మేరకు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నట్లు ఆర్‌అండ్‌బీ జిల్లా ఈఈ శ్రీధర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా డీఈ సునీల్‌రెడ్డి, ఏఈ హుసేన్‌తో కలిసి ఆయన కల్వర్టు పనులను పరిశీలించారు. పాతపాడు నుంచి యాగంటిక్షేత్రానికి వెళ్లే రహ దారిలో కల్వర్టు దెబ్బతినడంతో మంత్రి బీసీ పదిరోజుల క్రితం పరిశీ లించారన్నారు. త్వరితగతిన కల్వర్టు పనులు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారన్నారు. ఆయన ఆదేశాల మేరకు యుద్ధప్రాదిపదికన రోడ్డు పనులు పూర్తి చేస్తున్నట్లు ఈఈ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు మౌళీశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల సాధికారత

చాగలమర్రి, జూన్ 25: టీడీపీతోనే బీసీల సాధికారత సాధ్యమని బీసీ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. మంగళవారం బీసీ సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బీసీలకు భరోసా కల్పించినట్లయిందని అన్నారు. టీడీపీ ప్రభుత్వంలో బీసీలకు ఆదరణ పనిముట్లు, కార్పొరేషన్‌ల ద్వారా నిధులు మంజూరు చేశారని, ఇప్పుడు కూడా బీసీలను ఆదుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. నాయకులు రామతీర్థం, పీరయ్య, సుబ్బరాయుడు, వాసు, చిన్నికృష్ణయ్య పాల్గొన్నారు.

ఆర్‌బీకే తనిఖీ

చాగలమర్రి, జూన్ 25: చాగలమర్రిలోని 2, 3 ఆర్‌బీకే కేంద్రాలను మంగళవారం ఏవో రంగనేతాజీ తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 17వ విడత పీఎం కిసాన్ నిధులు రైతులకు మంజూరయ్యాయని తెలిపారు. ప్రతి రైతుకు రూ.2 వేల నిధులు వారి ఖాతాల్లో జమ చేశారని అన్నారు. పీఎం కిసాన్ నిధులపై ఫిజికల్ వెరిఫికేషన్ చేస్తున్నామని అన్నారు. రైతుల ఫొటోలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని అన్నారు. మల్లేవేముల ఆర్‌బీకే కేంద్రాన్ని ఏఈవో మంజుల తనిఖీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయంలో..

రుద్రవరం, జూన్ 25: మండలంలోని పేరూరు గ్రామంలో ఉన్న సచివాలయాన్ని ఈవోపీఆర్‌డీ శ్రీనివాసశర్మ మంగళవారం తనిఖీ చేశారు. సిబ్బంది సమయ పాలన పాటించడం లేదన్న విమర్శల నేపథ్యంలో ఆయన విచారణ చేశారు. పంచాయతీ కార్యదర్శి నాగేశ్వర్‌రెడ్డి విధులకు హాజరు కావడం లేదని విచారణలో తేలిందన్నారు. సమయపాలన పాటించని వారికి మెమోలు జారీ చేస్తామని తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మంత్రులను కలిసిన డోన్ నాయకులు



మంత్రి అచ్చెన్నాయుడుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న మల్లికార్జున

డోన్, జూన్ 25: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రజా వైద్యశాల మల్లికార్జున మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి చాంబరులో అచ్చెన్నాయుడుకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సన్మానించారు. బీసీ సెల్ కమిటీలో కష్టపడిన నాయకులకు, కార్యకర్తలకు న్యాయం చేయాలని, మత్స్యకారులను ఆదుకోవాలని ఈ సందర్భంగా మంత్రికి వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా సంక్షేమ శాఖ మంత్రి సవితను కలిసి మల్లికార్జున అభినందనలు తెలిపారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

చాగలమర్రి, జూన్ 25: పశువులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని చాగలమర్రి పశువైద్యశాఖ ఏడీ వరప్రసాదు అన్నారు. మంగళవారం పశువైద్య కేంద్రంలో ఆయన మాట్లాడుతూ చాగలమర్రి, ఉయ్యాలవాడ మండలాల్లో 70 శాతం పశువులకు టీకాలు వేశామని అన్నారు. పశువుల్లో వచ్చే గొంతువాపు, గొర్రెలు, మేకల్లో వచ్చే చీటిక వ్యాధి నివారణకు ముందస్తుగా టీకాలు వేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీసీని విమర్శించే అర్హత వైసీపీ నాయకులకు లేదు



మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు వీఆర్ లక్ష్మీరెడ్డి

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 25: వైసీపీ నేతలు అనుమతి లేకుండా ఆర్‌అండ్‌బీ రోడ్డును తవ్వితే ఆ శాఖ అధికారులు కేసులు పెట్టారని, దీనిపై మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని విమర్శించే అర్హత వైసీపీ నేతలకు లేదని టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీఆర్ లక్ష్మీరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ యువ నాయకుడు కామిని క్రిష్టరంగారెడ్డి, అంబటి వివేకానంద రెడ్డిలతో కలిసి వీఆర్ మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని సోమవారం తుమ్మలపెంటకు వచ్చి మంత్రిపై ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. మంత్రి అని కూడా చూడకుండా ఏకవచనంతో సంబోధించడం వైసీపీ నాయకులకే చెల్లిందన్నారు. అక్రమంగా రోడ్డు తవ్వితే అర్‌అండ్‌బీ అధికారులు కేసు పెటారని దాన్ని మంత్రికి ఆపాదించడం తగదన్నారు. కార్యక్ర మంలో అమరనాథరెడ్డి, వివరామిరెడ్డి, శేషారెడ్డి, వెంకటరామిరెడ్డి, అశ్వర్థరెడ్డి పాల్గొన్నారు.

మినీ మినరల్ వాటర్ ప్లాంటు నిర్మాణానికి భూమి పూజ

బేతంచెర్ల, జూన్ 25: పట్టణంలోని బైటిపేటలోని ప్రజలకు శుద్ధ జలాన్ని అందించేందుకు మినీ మినరల్ వాటర్ ప్లాంటు నిర్మాణానికి డోన్ టీడీపీ యువ నాయకురాలు కోట్ల చిత్రమ్మ మంగళవారం సాయం త్రం భూమి పూజ చేశారు. ప్రజల తాగునీటి సౌకర్యార్థం ఈ ప్లాంటు ఏర్పాటు చేస్తున్నట్లు టీడీపీ నాయ కుడు భీమేశ్వర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న కోట్ల చిత్రమ్మ

ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవాలి



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న వెంకటసుబ్బారెడ్డి

డోన్(రూరల్), జూన్ 25: ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం చిన్న మల్కాపురం గ్రామ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో తెలుగు, ఇంగ్లీషు మాధ్యమాలను సమాంతరంగా అమలు చేయాలని కోరారు. జీవో.117ను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు సుబ్బరాయుడు, గోపాల్, జనవిజ్ఞాన వేదిక నాయకులు మాణిక్యం శెట్టి పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటు కోసం స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్యాపిలి, జూన్ 25: పట్టణ సమీపంలోని వానకొండ ప్రాంతంలోని సర్వే నెం 960లో పరిశ్రమల ఏర్పాటు కోసం పరిశ్రమల శాఖ జోనల్ అధికారి సోమశేఖర్‌రెడ్డి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వే నెంబరులో దాదాపు 50 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఇక్కడ ఏ పరిశ్రమలకు అనుకూలంగా ఉంటుందో గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. ఆయన వెంట తహసీల్దారు ప్రతాప్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దారు మారుతి, వీఆర్వో సోమశేఖర్, సర్వేయర్ నాగరాజు పాల్గొన్నారు.